# స్వేదబిందువులో

శివనారాయణ అద్దెకని కట్టించిన రెండుపోర్షన్లలోకి ఒకేసారి రెండు ఫామిలీలు దిగాయి. విశేషం ఏమిటంటే పెళ్ళయి ఇంకా నెలకూడా కాని నూతన దంపతులు వాళ్ళు.

దిగిన మరునాడే అవతలింటి శ్రీలక్ష్మికీ, ఇవతలింటి మంజులకి మాటలు కలిశాయి. స్నేహం చిగురించింది. వాళ్ళ మగళ్ళు ఆఫీసులకెళ్ళిపోగానే వీళ్ళిద్దరూ పెరట్లో బట్టలారేస్తూనో, అంట్లు కడుగుతూనో మాటల్లోపడేవాళ్ళు.

"అబ్బా! రోజూ ఈ అంట్లు కడగడం, బట్టలుతకడం అంటే నాకు విసుగేస్తోంది. అర్జంట్‌గా పనిమనిషిని చూడమని చెప్పాను మా ఆయనకు" అంది పెళ్ళయినప్పటి నుండి మంజులాప్రసాద్ అని వ్రాసుకునే మంజుల.

"పనివాళ్ళు చేస్తే నాకు నచ్చదు. వాళ్ళేదో హడావిడిగా పైపైన చేసిపోతారు. అంట్లు కడిగితే జిడ్డుపోదు, అంటుపోదు. మళ్ళీ కడుక్కుంటేగాని శుభ్రమనిపించదు నాకు. బట్టలైనా నేను వుతుక్కుంటేనే హాయిగా కట్టుకోగలను. అయినా మన పని మనం చేసుకోవడంలో అదో తృప్తి. డబ్బులూ మిగులుతాయి. పని శుభ్రంగా వుంటుంది. ఇంటిపని నాకు విసుగనిపించదు" ఇంకా భర్తపేరు తన పేరుతో కలుపుకోని శ్రీలక్ష్మి అంది.

"నాకైతే పనంటే బోర్. మా ఆయనకు మంచి జాబే వుంది. జీతం బాగానే వస్తుంది. పనిమనుషులు చేసే పనులు కూడా చేసి ఆయనకి డబ్బులు మిగిల్చి ఏం చేయాలి? ఇరవై అయిదేళ్ళు వచ్చేవరకు పుట్టింట్లో ఎలాగూ కష్టాలుపడ్డాను. ఇంట్లో చాకిరీ సరే. బి.కాం చదివాను కదా ఇంట్లో ఏం తోస్తుందని కాన్వెంట్‌లో టీచర్‌గా

చేసేదాన్ని. ముచ్చటగా ఓ చీర కొందామన్నా వీలయ్యేది కాదు. మధ్యతరగతి కుటుంబం కావడంవల్ల ఎప్పుడూ ఏవో అవసరాలు వచ్చి నా జీతాన్ని దిగమింగేవి. ఎప్పుడూ ఏ కోరికా తీరేది కాదు. నేనప్పుడే డిసైడ్ చేసుకున్నాను మంచి ఉద్యోగం చేసే వాడికిచ్చి చేస్తే తప్ప పెళ్ళి చేసుకోకూడదని! పెళ్ళయ్యాక రాణీలా సుఖపడాలని! మంచి ఉద్యోగస్తుడు కావాలన్న నా కోరిక తీర్చడంకోసం మాకున్న ఒక్కగానొక్క ఇల్లు అమ్మాల్సి వచ్చింది. నా పెళ్ళి చేసి మా వాళ్ళు అద్దె ఇంట్లోకి మారారు."

"నీ తరువాత ఇంకా ముగ్గురు ఆడపిల్లలున్నారన్నావు. వాళ్ళ పెళ్ళిళ్ళు?"

"అది ఆలోచించాల్సింది నేను కాదు. తమ స్థోమతేమిటో గుర్తించకుండా వరుసగా నలుగురాడపిల్లలకి జన్మనిచ్చారే వాళ్ళు."

"మరీ ఇంత నిర్దాక్షిణ్యంగా ఆలోచించే ఆడపిల్లలుకూడా వుంటారని నాకు తెలియదు. నేనూ, మా తల్లిదండ్రులకు నలుగురు సంతానంలో పెద్దదాన్ని. బిఎస్సీ అయ్యాక అన్నామలై యూనివర్సిటీ నుండి ప్రైవేట్‌గా బి.ఇడి. కూడా చేశాను. టెంత్ పాసైనప్పటినుండి చిన్నపిల్లలకి ట్యూషన్స్ చెప్పేదాన్ని. డిగ్రీ పాసయ్యాక కాన్వెంట్‌లో టీచరుగా చేశాను. ఇంటిదగ్గర ట్యూషన్స్ కూడా చెప్పేదాన్ని. అంతా కలిపితే నెలకి వెయ్యి రూపాయల దాకా వచ్చేది. అంతా నాన్నచేతికే ఇచ్చేదాన్ని. శ్రీరాముడికి ఉడుత సాయంలా నాన్నకి ఆర్థికంగా నేనామాత్రం సాయపడుతున్నానని ఓ విధమైన తృప్తితో ఫీలయ్యేదాన్ని. నా కోసం శక్తికిమించిన సంబంధాలు చూస్తుంటే నేనే వారించాను. నా పెళ్ళికోసం తిండికి గింజలొచ్చే ఆ చారెడుపొలం అమ్మొద్దని చెప్పాను. నన్ను పోషించగల మామూలు ఉద్యోగస్తుడైతే చాలునన్నాను. నా పెళ్ళి కోసం మా వాళ్ళని కష్టపెట్టలేదన్న తృప్తి నాకుంది."

"అంత త్యాగం అనవసరమంటాను. కన్నందుకు మనల్ని మంచిచోట ఇవ్వాల్సిన బాధ్యత వాళ్ళకి లేదా ఏం? పెళ్ళయ్యి ఒకసారి పుట్టింటి గడపదాటాక ఇక దేనికీ దేబిరించక్కర్లేకుండా వుండాలని నా పాలసీ"

"అత్తింట అష్టభోగాలున్నా పుట్టింటిమీద ఏడ్చేవాళ్ళెంత మంది లేరు?"

"నేను మాత్రం వాళ్ళలో చేరను."

✧ ✧ ✧

"ఉదయమనగా వెళ్ళి ఇప్పుడొస్తున్నావు! ఎక్కడికెళ్ళావేమిటి?" ఉదయం తొమ్మిదింటికెళ్ళి సాయంత్రం నాలుగింటికొచ్చిన శ్రీలక్ష్మినడిగింది మంజుల.

"లిటిల్‌ఫ్లవర్ స్కూల్లో టీచర్‌గా జాయినయ్యాను ఈ రోజు. మాథ్స్ టీచర్ పోస్ట్ ఖాళీగా వుందట మా స్కూల్లో. అనుభవమున్న వాళ్ళయితే సాలరీ ఎనిమిదివందల దాకా ఇస్తారంట చేస్తావా?"

"పెళ్ళికాకముందు ఎలాచేశానో గాని ఉదయంనుండి సాయంత్రందాకా నోరు నొప్పిపుట్టేలా అరిచి అరిచి చచ్చే టీచరు పని మాత్రం ఇప్పుడు చేయలేను. అయినా నేను జాబ్ చేయాల్సిన అవసరం ఏమిటిప్పుడు? మా ఆయనకి జీతం బాగానే వస్తుంది. త్వరలో ప్రమోషన్‌కూడా వచ్చి జీతం పెరుగుతుందట. మేం హాయిగా బతకడానికి ఆ జీతం చాలు."

"మీ ఆయనకి ఎంత జీతం వచ్చినా నీదవుతుందా ఏమిటి?" శ్రీలక్ష్మి ఎగతాళిగా అంది.

"ఆయనే నావాడయ్యాక ఆయన జీతం నాది కాకపోవడం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింది మంజుల.

"ఆయన నీవాడేమోగాని ఆయన జీతం మాత్రం నీది కాదు. ప్రతి ఆడపిల్లకీ పెళ్ళైనా కాకపోయినా తనకంటూ కొంత సంపాదనుండాలి. అది జాబ్‌వల్ల కావచ్చు, ఏదైనా కుటీర పరిశ్రమవల్ల కావచ్చు. తన అవసరాలను, తన సంపాదనతో తీర్చుకోవడంలోనే మన ఆత్మగౌరవం నిలుస్తుందని నా ఉద్దేశం. పావలా పువ్వులకోసం, పదిరూపాయల జాకెట్‌గుడ్డకోసం భర్తమీద ఆధారపడడం ఏ ఆడదానికీ ఆత్మగౌరవం కాదు."

"భర్త అంటే పరాయివాడా? ఇందులో ఆత్మగౌరవం ప్రసక్తి ఏముంది?"

"భర్త నీవాడే అయినా అతడి సంపాదన నీ ఇష్టప్రకారం ఖర్చుపెట్టుకోడానికి ఒప్పుకోడు. తన ఇష్టప్రకారమే ఖర్చు పెడతాడు. అదే నువ్వు సంపాదించుకుంటున్నా వనుకో! ఖర్చుపెట్టడంలో నీకు స్వేచ్ఛ వుంటుంది."

"కొందరు భర్తలు తమ భార్యల జీతం డబ్బులు కూడా తామే లాగేసుకుని పావలా పువ్వులకోసం, పదిరూపాయల జాకెట్‌గుడ్డకోసం తమని దేబిరించేట్టు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదని నువ్వొప్పుకుంటే ఆడదాని సంపాదనకు అర్థమేమిటి?"

"ఎక్కడో పదిశాతంకేసులు అలా వుంటాయేమోగాని చాలామంది ఆడవాళ్ళు తమ సంపాదనను తమ ఇష్టంవచ్చినట్టుగా ఖర్చుపెట్టుకోగలుగుతున్నారు.

పెళ్ళికాకముందు తండ్రులకు, పెళ్ళాయ్యాక భర్తలకు ఆర్థికంగా చేదోడు వాదోడుగా వుండగలుగుతున్నారు. సంసారం చేసుకునే గృహిణి కంటే సంపాదించే స్త్రీ సమాజంలో ఎక్కువ గౌరవాభిమానాలు పొందగలుగుతోంది. ముఖ్యంగా ఆత్మగౌరవంతో బతకగలుగుతోంది."

"ఏమిటో ఇదంతా కోరి తెచ్చుకుంటున్న కష్టాలనిపిస్తుంది. ఉద్యోగం పేరుతో బయట చాకిరీ, గృహిణిగా ఇంట్లో చాకిరీ మరీ అంతసుఖం లేని బతుకుదేనికి?"

"మంచుబిందువులో సౌందర్యాన్ని చూడగలిగినట్టే స్వేదబిందువులోనూ సౌందర్యాన్ని చూడగలిగితే సుఖమన్నదానికి అర్థం నీకు తెలుస్తుంది.

✧ ✧ ✧

"మంజూ మొన్న వెయ్యి రూపాయలు బీరువాలో వున్న లక్ష్మీడబ్బాలో పెట్టాను. ఇప్పుడు చూస్తే ఆరువందలే వున్నాయి. మిగతా నాలుగు వందలు నువ్వు తీశావా?" ప్రసాద్ అడిగాడు.

"తీశాను!"

"ఏం చేశావు అంత డబ్బు?"

"ఎంత డబ్బండీ నాలుగు వందలేగా? మొన్న షాపింగ్‌చేసి పూసల ఆర్చీ, ఫ్లవర్‌వేజ్, టేబిల్‌క్లాత్, కర్టెన్లూ తేలేదూ? బాగున్నాయని మెచ్చుకున్నారే?"

తలపట్టుకున్నాడు ప్రసాద్. "ఆ డబ్బు నీ పాకెట్‌మనీలోంచి ఖర్చుచేశావేమో అనుకున్నాను."

"నాకు పాకెట్‌మనీ ఎక్కడిదీ? ఎవరిస్తారు?" ఆశ్చర్యంగా అడిగింది.

"వచ్చేప్పుడు మీ వాళ్ళిచ్చారేమో, అందుకే అంత లగ్జరీగా ఖర్చుపెట్టి ఇంటి డెకరేషన్‌కని తెచ్చావేమో అనుకున్నాను."

"నాకు పాకెట్‌మనీ ఇచ్చి పంపేంత శ్రీమంతులేం కాదు మావాళ్ళు. నా పెళ్ళి చేసి పంపేసరికి వాళ్ళ తలప్రాణం తోకకొచ్చింది" విసురుగా అంది మంజుల.

"నేనూ అంత శ్రీమంతుడినేం కాదు మంజూ! కటింగ్స్ పోను నా చేతికి వచ్చే మూడువేల జీతంలో వెయ్యి రూపాయలు నాన్నకి పంపాలి. ఊరిదగ్గర చెల్లి పెళ్ళికని చేసిన అప్పుంది... అందుకని. మిగిలిన రెండువేలల్లోనే మన సంసారం నడవాలి. ఎంత గుట్టు నేర్చుకుంటే అంత అందం. ఈ నెల ఖర్చులకని పెట్టిన

వెయ్యిరూపాయల్లో ఫస్ట్‌వీక్ పోకముందే నాలుగువందలు హుష్‌కాకీ చేశావు. ఆరువందలతో ఈ నెల గడవాలి. చాలకపోతే ఎవరిదగ్గరైనా అప్పుచేద్దాం అనే రకం కాదు నేను. అప్పు చెయ్యడమంటే పరమ చిరాకు నాకు."

కన్నీళ్ళపర్యంతమైంది మంజులకు. ఫ్లవర్‌వాజ్ తీసి నేలకేసి కొట్టి, గుమ్మానికి కట్టిన పూసల ఆర్చీ పీకేసి కర్టెన్లు చింపి పోగులు పెట్టాలనిపించింది కాని తమాయించుకుంది.

✧ ✧ ✧

"మొన్న శ్రీలక్ష్మివాళ్ళ స్కూల్‌కి ఇంపోర్టెడ్ శారీస్ అమ్మే ఆమె వచ్చిందట. శ్రీలక్ష్మి ఈ శారీ కొందట. మూడొందలరూపాయలు. రెండు ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా కట్టాలట. శారీ బాగుంది కదా! నేను చెబితే ఇలాంటిదే మరొకటుంది తెచ్చిపెడతానంది శ్రీలక్ష్మి!" చీర విప్పి భుజంమీద వేసుకుని చూపుతూ అంది మంజుల.

"పెళ్ళి చీరలు బీరువానిండా వున్నాయి. రోజుకో చీర కట్టినా కట్టిన చీర కట్టకుండా ఏడాది వరకూ కట్టొచ్చు. అన్ని చీరలుండగా ఇప్పుడీ ఇంపోర్టెడ్ చీర తక్కువబడిందా?"

"చీర చాలా బాగుంది అదీగాక నా దగ్గర ఇంపోర్టెడ్ ఒక్కటి కూడా లేదు."

"మీ ఆడవాళ్ళకి బాగుండని చీరలు కూడా వుంటాయా?"

"మొన్న మూడువేలదాకా ఎరియర్స్ వచ్చాయన్నారు కదా? పెళ్ళయ్యాక పెళ్ళాం మొదటిసారి ముచ్చటపడి కోరిన కోరిక! తీర్చకపోతే నా మీద మీకున్న ప్రేమనే శంకించాల్సి వస్తుంది?"

"మగడి ప్రేమను అతడు తెచ్చే చీరల్లోనూ నగల్లోనూ చూడడం చాలా దారుణం మంజూ! అది సంస్కారంలేని ఆడవాళ్ళు చేసేపని."

చివుక్కుమన్నట్టుగా అయింది మంజూకు. ముఖం ఎర్రబడింది. "మరి ఎందులో చూడాలెం ఆ ప్రేమ?" చురుగ్గా అడిగింది.

"ఇందులో!" అతడి బిగికౌగిలింతలో ఊపిరాడనట్టుగా అయింది ఆమెకు.

ఆ సాయంత్రమే శ్రీలక్ష్మిని అడిగింది మంజుల "మీ స్కూల్లో మాథ్స్ టీచర్ పోస్ట్ ఖాళీగా వుందన్నావు అది ఫిలప్ అయ్యిందా?" అని.

*వనితాజ్యోతి మాసపత్రిక, సెప్టెంబర్1998*

◆